క్లుప్తంగా

గర్భకోశ వ్యాధులపై అవగాహన



శిబిరానికి సంబంధించి కరపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు

యాలాల: మండలంలోని ముద్దాయిపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గర్భ కోశ వ్యాధుల నివారణ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గర్భ కోశ వ్యాధుల సమస్యతో బాధపడుతున్న సుమారు 20 పశువులకు మండల పశువైద్యాధికారి శివ ప్రసాద్ చికిత్స అందించారు. అనంతరం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. క్యాంపు అనంతరం పశువులకు సంబంధించిన అంటువ్యాధులు, ఇతరత్రా రోగాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, పశువైద్య సిబ్బంది అనార్ సింగ్ తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కేజీబీవీలో కరాటే శిక్షణలో విద్యార్థులతో ఎంఈఓ

బంట్వారం: ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. మంగళవారం కోట్‌పల్లి కేజీబీవీలో మార్షల్ ఆర్ట్స్ కరాటే తరగతులను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆడపిల్లలు బాలుర కంటే తక్కువేమి కాదని అన్ని రంగాల్లో బాలికలే ముందుండాలన్నారు. కరాటేలో శిక్షణ పొంది ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు ఆటలు, కరాటే శిక్షణలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

అయ్యప్పమాల పవిత్రమైనది



ఇరుముడి పూజలో పాల్గొన్న బీజేపీ నేతలు

పూడురు: అయ్యప్ప మాల అనేది ఎంతో పవిత్రమైనదని కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్ పటేల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామగుండం దేవాలయంలో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప మాలధారణ అనేది ఎంతో పవిత్రమైనదని, మాలధారణ చేయడంతో వ్యక్తిలో మానసిక పరివర్తన వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పూడురు బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు శ్రీశైలం, నాయకులు సుభాన్, సత్యనారాయణ, శ్రీకాంత్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మర్పల్లి: మండల పరిధిలోని పిల్లిగుండ్ల యూపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎండీ మోసీన్, ఉపాధ్యాయులు సుప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒక్కరోజు గురువులుగా వ్యవహరించి తోటి మిత్రులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శోభాయమానంగా పల్లకీసేవ



పల్లకీ సేవలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

కుల్కచర్ల: మండల కేంద్రంలో అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాముల పల్లకీ సేవ శోభాయమానంగా కొనసాగింది. మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వాములు, భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

నేడు అయ్యప్ప మహాపడి పూజ

కుల్కచర్ల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం మహాపడి పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు పట్లోళ్ల వెంకట్రాంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

‘మధ్యాహ్న’ వంటకు పాట్లు

- పాఠశాలల్లో కార్మికులకు అందని సబ్సిడీ సిలిండర్లు
- కట్టెల పొయ్యితో వండుతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీలో నిర్వాహకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు వండే వంటకు కట్టెల పొయ్యే దిక్కవుతుంది. ఏళ్ల తరబడి కట్టెల పొయ్యి ద్వారా వంటలు చేస్తుండడంతో వాటితో వచ్చే పొగకు నిర్వాహకులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. వర్షాకాలంలో అయితే వీరి బాధలు అనంతం. ఆరుబయట వండుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దోమ మండల వ్యాప్తంగా 70 పాఠశాలలు ఉండగా అందులో 10 ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 5,221 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే వీరందరికీ మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నా ప్రభుత్వాలు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కార్మికులు కట్టెల పొయ్యి ద్వారానే వండుతూ పొగతో పాట్లు పడుతున్నారు.

కట్టెల కొరత

మండల వ్యాప్తంగా వ్యవసాయ భూములను రైతులు సాగు చేస్తుండగా, మరోపక్క రియల్టర్లు భూములను కొనుగోలు చేసుకొని చదును చేయడంతో కట్టెల కొరత తీవ్రంగా ఏర్పడింది. వంట చేసేందుకు కార్మికులు కట్టెలను తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటను వండేందుకు ప్రభుత్వం సబ్సిడీ సిలిండర్ల ఇవ్వకపోవడంతో అధిక ధరలకు బయట మార్కెట్ నుంచి కట్టెలను కొనుగోలు చేసి విద్యార్థులకు వంటను వడ్డిస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. ఓ పక్క నిత్యవసర సరుకుల ధరలు కూడా పెరగడంతో తమకు అందించే బిల్లులు సరిపోవడం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



కిష్టాపూర్ పాఠశాలలో కట్టెల పొయ్యిపై వండుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పొగతో నిత్యం అవస్థలు

సిలిండర్లు లేకపోవడంతో కట్టెల పొయ్యిపైనే వంట చేస్తుండడంతో వాటితో వచ్చే పొగ కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఆయా పాఠశాలలో తరగతి గదుల పక్కనే కార్మికులు వంటలు చేస్తుండడంతో వచ్చే పొగకు తరగతి గదుల తలుపులను మూసి ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. సబ్సిడీ సిలిండర్లు అందించాలని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు సబ్సిడీ సిలిండర్లను అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

“కట్టెలతో వండుతున్నాం

మధ్యాహ్న భోజనం చేయా లంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. సిలిండర్లు లేక కట్టెల పొయ్యితోనే వంట వండుతున్నాం. కట్టెలు దొర కక అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాం. పొగతో అవస్థలు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం సబ్సిడీ సిలిండర్లు అందించాలి.

– లక్ష్మి, కార్మికురాలు, కిష్టాపూర్

ఆదేశాలు రాలేదు



పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు కట్టెల పొయ్యి ద్వారానే వండుతున్నారు. పొగతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సబ్సిడీ సిలిండర్లు అందించాలని నిర్వాహకులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– వెంకట్, ఎంఈఓ, దోమ

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో నాయకులు

మర్పల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, నాయకులు రాములుయాదవ్‌తో కలిసి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల పైచిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాచన్న, మల్లేశ్ యాదవ్, ఫసి, జగదీశ్వర్, ఖలీమొద్దీన్, చంద్రన్న, అబ్రహాం, నాగేశ్, సర్వేశ్, సంజీవరెడ్డి, రాములు, పాండునాయక్, గోపాల్, కార్యకర్తలు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోలు నిలిపివేత

అనంతగిరి: పరిగిలో ఉన్న నరసింహ కాటన్ మిల్లులో అధిక మొత్తంలో పత్తి నిల్వలు పేరుకుపోయినందున పత్తి జిన్నింగ్ చేయడానికి బుధవారం సీసీఐ ద్వారా కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

యాలాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా దానయ్య

యాలాల: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తున్న దానయ్య మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుత తహసీల్దార్ అంజయ్య వ్యక్తిగత కారణాలతో వారం రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో దానయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ధారూరుకు రూ.5.38 కోట్లు మంజూరు

ధారూరు: మండలంలో సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని మండల ప్రత్యేక అధికారి మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా విడుదలైన రూ.5.38 కోట్లతో మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చలికి గజగజ

దౌల్తాబాద్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చలి తీవ్రత ఎక్కువైంది. మంగళవారం చలికి తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు చలిమంటలు కాచుకుంటున్నారు. చలికాలంలో వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 8గంటలైనా చలి తీవ్రత తక్కువ కాకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారి నరేందర్‌రెడ్డి

కొత్తూరు: ఉపాధిహామీ పనుల పట్ల సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారి నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ఈ నెల 9 నుంచి 16వ తేదీవరకు 12 గ్రామ పంచాయతీల్లో గ్రామసభల ద్వారా సేకరించిన వివరాలను ఆయన వెల్లడించారు. రోడ్ల పక్కన మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, ఇంకుడుగుంతలతో పాటు ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనులపై సిబ్బంది తనిఖీలు చేసినట్లు తెలిపారు. కాగా తనిఖీల్లో చాలాచోట్ల మొక్కలు చనిపోవడం, ఇంకుడు గుంతలు సక్రమంగా లేకపోవడం, ఒకరికి బదులుగా మరొకరికి డబ్బులు జమచేసినట్లు క్షేత్రస్థాయిలో తనిఖీ అధికారులు గుర్తించినట్లు వివరించారు. ముఖ్యంగా పంచాయతీల్లో ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను మండల పరిషత్ అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సునీతామూర్తి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎంపీడీఓ అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి




ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్: రైతులందరికీ రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ రైతులందరికీ కాలేదన్నారు. అదే విధంగా రైతులు వినియోగించే 15 సంవత్సరాలు దాటిన ట్రాక్టర్ ట్రాలీని స్క్రాబ్‌గా మార్చాలన్న ఆర్‌టీఏ నిబంధనను సవరించాలన్నారు. ట్రాలీ నుంచి పొల్యూషన్ వచ్చే అవకాశం లేదన్నారు. ఈ విషయాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, రామచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పెంటయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జగదీశ్, నర్సింహారెడ్డి, మల్లయ్య, నర్సింలు, చంద్రమౌళి, రామస్వామి తదితరులు ఉన్నారు.

సీపీఐకి వంద సంవత్సరాల చరిత్ర

- పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల: దేశంలోనే వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో మంగళవారం సీపీఐ పార్టీ శతదినోత్సవం సందర్భంగా వారోత్సవాలు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా పేదల సమస్యలపై పోరాటం చేస్తూ వారికి అండగా నిలబడుతుందన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల కోసం పనిచేసే పార్టీని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



కందవాడలో సీపీఐ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి జంగయ్య, నాయకులు

కాల్వల మరమ్మతులు పూర్తి

హర్షం వ్యక్తం చేస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టు రైతులు

ధారూరు: లక్నాపూర్ ప్రాజెక్టు కుడి కాల్వకు సాగు నీటిని వదిలిపెట్టడంతో రబీ పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోని లక్నాపూర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో మట్టి పేరుకుపోయి పొదలు, చెట్లు మొలిచి నీటి ప్రవాహానికి అవరోధంగా మారాయి. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తగడి మాణిక్‌రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన రూ.18.44 లక్షలు మంజూరు చేయించారు. దీంతో మండల పరిధిలోని 9.6 కిలోమీటర్ల కుడి కాల్వ, 11.8 కిలోమీటర్ల ఎడమ కాల్వను పూర్తిగా మరమ్మతులు చేశారు. లక్నాపూర్ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం రెండు కాల్వలకు ఒకేసారి వదిలితే సాగునీరు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో సంవత్సరానికి ఒకసారి చొప్పున కుడి, ఎడమ కాల్వలకు సాగునీటిని అధికారులు వదులుతున్నారు. నాగారం, మోమిన్‌ఖుర్దు, రాజాపూర్, మిట్టకోడూర్, లక్నాపూర్ గ్రామాల రైతులు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో పంటలను సాగు చేసుకుంటున్నారు. మండలంలోని మోమిన్‌కలాన్, అంతారం, ఐనాపూర్(వికారాబాద్), లక్నాపూర్(పరిగి) గ్రామాలు ఎడమకాల్వ పరిధిలోకి వస్తాయి. ప్రాజెక్టు పూర్తిగా మట్టితో నిండిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో సంవత్సరానికి ఒక కాల్వ చొప్పున నీటిని వదిలిపెట్టి సాగునీటిని అందిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలు ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వ పరిధిలో ఉన్నాయి.



మరమ్మతులు తర్వాత పొలానికి వెళ్తున్న కాల్వ నీరు

సమష్టి కృషితోనే పార్టీ బలోపేతం

సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్

పూడూర్: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, ఉపాధ్యక్షుడు శ్రీశైలంతో కలిసి బూత్ స్థాయి కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు బీజేపీ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఎలాంటి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, సుభాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బూత్ స్థాయి కమిటీకి సంబంధించి నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

లగచర్ల ఘటన బీఆర్ఎస్ పనే

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్

మర్పల్లి: లగచర్ల ఘటన బీఆర్ఎస్ పార్టీ కుట్రతోనే జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ ఆరోపించారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లగచర్లలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు రైతులతో మాట్లాడి భూములు తీసుకొనేందుకు ప్రభుత్వ అధికారులు లగచర్లకు వెళ్లితే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై బీఆర్ఎస్ గుండాలతో దాడి చేయడం సరైంది కాదన్నారు. ఈ రోజు అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, నాయకులు రాములుయాదవ్, ఖలీమొద్దీన్, సంజీవరెడ్డి, నాగేశ్, జగదీశ్వర్, చంద్రన్న, అబ్రహాం, రాచన్న, సర్వేశ్, నర్సింలు యాదవ్, పాండునాయక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సురేశ్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్డీఓ సరిత

షాద్‌నగర్: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ సరిత అన్నారు. మంగళవారం పెన్షనర్స్ డే సందర్భంగా పట్టణంలోని పెన్షనర్ల భవనంలో పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడుతూ.. పెన్షనర్లు అందరితో కలిసిమెలసి సుఖసంతోషాలతో జీవించాలన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు. పెన్షనర్ల సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రామారావు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి పెన్షన్ తమ హక్కు అన్నారు. తాను చేసిన సేవా కాలానికి గుర్తింపుగా పెన్షన్ చిన్న పురస్కారమన్నారు. దీనిని ఏ ప్రభుత్వం నిషేధించడానికి వీలు లేకుండా సుప్రీం కోర్టులో కేసు వేసి పెన్షనర్లకు 1982లో పెన్షన్ వచ్చే విధంగా సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. అప్పటి నుంచి డిసెంబర్‌లో పెన్షనర్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లను సన్మానించారు. పెన్షనర్లు ఆర్డీఓ సరితను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్, పాండు, శంకర్, సత్యనారాయణ, నాగేశ్, నర్సింలు, షబ్బీర్, అబ్దుల్ గఫార్, స్వరాజ్‌బాబు, జనార్ధన్, పాండు, శంకర్, సత్యనారాయణ, గోపాలస్వామి, గోపాల్‌రావు, రమాదేవి, గిరిజ, అంజు, మాణిక్యం, విష్ణుగౌడ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓను సత్కరిస్తున్న పెన్షనర్లు

జోరుగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



దౌల్తాబాద్: నందారంలో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తూ అధికారులు సర్వే చేపట్టారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వాటి వివరాల ఆధారంగా అధికారులు ఇంటింటికీ తిరుగుతూ వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొండన్న తదితరులు పాల్గొన్నారు.

15 వేల దరఖాస్తులు సర్వే సక్రమంగా చేపట్టాలి

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి సర్వేను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని తొర్మామిడి, బొప్పునారం తదితర గ్రామాలను సందర్శించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల జాబితా ఆధారంగా సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మంగళవారం ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో 15 వేల దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు.

ప్రారంభమైన సర్వే

దుద్యాల్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ప్రజాపాలన దరఖాస్తులో ఉన్న వివరాల ఆధారంగా ఇంటింటికి తిరుగుతూ ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్నారు. దరఖాస్తు దారుల వాస్తవ పరిస్థితులను ఇంటికి వెళ్లి గమనించిన తర్వాతనే నిక్షిప్తం చేస్తున్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలో ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. ఈ సందర్భంగా సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ నందారం, దౌల్తాబాద్ గ్రామాల్లో పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గోపాల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి



కొడంగల్ రూరల్: హుస్సేన్‌పూర్‌లో వివరాలను సేకరిస్తున్న అధికారులు